క్లుప్తంగా

108 పాత వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

కురిచేడు: ప్రజలకు అత్యవసర సేవలందించే 108 వాహనానికి కూటమి నాయకులు తమ పార్టీల రంగులు వేసుకున్నారు. ఆ వాహనాన్ని ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, ఎంపీడీఓ రాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కలిసి శనివారం ప్రారంభించారు. పాత వాహనాన్ని మరియు కూటమి రంగులు వేసిన వాహనాన్ని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రారంభించటం పలు విమర్శలకు తావిచ్చింది. కుల మతాల కతీతంగా అత్యవసర సేవలు అందించి అందరు ప్రాణాలు కాపాడే 108 వాహనాలకు పార్టీ రంగులు వేయటం ఇదే ప్రథమం.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పెద్దారవీడు: మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ పోతంపల్లి సమీప పొలాల్లో పేకాట స్థావరంపై ఎస్‌ఐ సాంబశివయ్యతో పాటు పోలీసులు శనివారం దాడి చేశారు. పొలాల్లో పేకాట ఆడుతున్న వారి నుంచి రూ.1.9 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. 14 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. జూదరులను కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు. గ్రామస్తుల సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఆయన వివరించారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి

దర్శి: ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ పంటల్లో వాతావరణ పరిస్థితుల ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ పి.సంధ్యారాణి వ్యవసాయ అధికారులకు సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణ మరియు సందర్శన కార్యక్రమం సంధ్యారాణి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలోని ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులను గమనించి పైర్లలో పోషకాలు, ఎరువులను తగు మోతాదులో అందించాలని సూచించారు. అంతర సేద్యం, కలుపు నివారణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వ్యవసాయ శాఖ అధికారులకు తగు సూచనలు అందించారు. సెప్టెంబర్ మాసంలో వర్షపాతం తగ్గితే వేసుకోదగ్గ ప్రత్యామ్నాయ పంటల వివరాలు, పొగాకు ప్రత్యామ్నాయ పంటల సాగు పద్ధతులను వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేశారు. జిల్లా వ్యవసాయ అధికార ప్రతినిధి రజనీకుమారి మాట్లాడుతూ సెప్టెంబర్ మాసంలో జిల్లాలో ఉన్న వ్యవసాయ స్థితిగతులు, వర్షపాత వివరాలను తెలియజేశారు. పలు మండలాల్లో నమోదైన వర్షపాతం, ఉష్ణోగ్రత పరిస్థితుల ఆధారంగా పంటల్లో సాగు పద్ధతులు చేపట్టాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ భూమిలో తేమ శాతం ఆధారంగా ఎరువులు వేసుకోవాలని సూచించారు. ప్రధాన ఎరువులు నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులనే కాకుండా సూక్ష్మ పోషకాలను కూడా ప్రస్తుతం సాగు చేస్తున్న పైర్లకు అందించాలన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం సస్యరక్షణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు మాట్లాడుతూ ప్రస్తుతం పంటల్లో ఆశించే ముఖ్య పురుగులు, తెగుళ్లు, యాజమాన్య పద్ధతులు, నివారణ చర్యల గురించి తెలిపారు. వరి, కంది, మొక్కజొన్న, మినుము, మిరప పంటలు ఆశించే ముఖ్య పురుగులు, తెగుళ్ల వాటి లక్షణాలు, వాటి నివారణ పద్ధతుల గురించి వివరించారు. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, దర్శి, సింగరాయకొండ, ఎర్రగొండపాలెం, ఒంగోలు మండలాల నుంచి హాజరైన ఆదనపు వ్యవసాయ సంచాలకులు వారి వ్యవసాయ సబ్ డివిజన్లో ఉన్న వ్యవసాయ స్థితిగతులు, పంట విస్తీర్ణం, వర్షపాతం వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. చీడపీడలు, ఎరువుల యాజమాన్యంలో వివిధ సమస్యలకు శాస్త్రవేత్తల ద్వారా సూచనలు, సలహాలు పొందారు.



దర్శి: తూర్పు చౌటపాలెంలో మోసాలు వివరిస్తున్న నాయకులు



దొనకొండ: పోలేపల్లిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

జగనన్న రాజ్యం మళ్లీ రావాలి

కురిచేడు: రెడ్‌బుక్ అరాచక పాలనపోయి జగనన్న రాజ్యం మళ్లీ తెచ్చుకొనేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం కురిచేడు మండలం బయ్యవరం, పెద్దవరం గ్రామాల్లో'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుచేస్తూ సూపర్ సిక్స్ పథకాలు కుటుంబంలో ఎంతమందికి అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, బయ్యవరం సర్పంచ్ మాలేపాటి నాగేశ్వరరావు, మేదరమెట్ల హరిబాబు, అడుసుమిల్లి నర్సింహారావు, మండల బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడు కిలారి శరత్‌బాబు, సోషల్ మీడియా కన్వీనర్ సంతోష్‌కుమార్, పెద్దవరం సర్పంచ్ మార్నెళ్ల నరసమ్మ, మార్నెళ్ల రామాంజీ, మార్నెళ్ల బాలయ్య, పడిగపాటి చంటి, చెన్నంశెట్టి గురవయ్య పాల్గొన్నారు.

దర్శి: అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పుడు హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి మండిపడ్డారు. మండలంలోని తూర్పు చౌటపాలెం, శామంతపూడి గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్లకార్డుల ద్వారా ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేవీరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్‌అమీన్ బాషా, మున్సిపాలిటీ వింగ్ అధ్యక్షుడు తుళ్లూరి బాబూరావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఇరుగుల శ్రీనివాసరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు భాస్కర్, రవీంద్రారెడ్డి, శ్రీను, రవి, నాగిరెడ్డి, బెలుం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



కురిచేడు: చంద్రబాబు మోసాలు వివరిస్తున్న నాయకులు

దొనకొండ (కురిచేడు): మోసాలు చేయడంలో చంద్రబాబును గిన్నిస్ బుక్‌లో ఎక్కించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దొనకొండ మండల అధ్యక్షుడు కాకర్ల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం దొనకొండ మండలం పోలేపల్లిలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ బొరిగర్ల ఉషా మురళి, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీ గుంటు పోలయ్య, జిల్లా యాక్టివ్ మెంబర్ బత్తుల వెంకట సుబ్బయ్య, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు కాలూరి రమణయ్య, అజయ్, వల్లభనేని వీరాచారి, ముడమంచు వెంకటేశ్వర్లు, ముడమంచు మంగయ్య, కందుల వెంకటేశ్వరరెడ్డి, కందుల చౌడరెడ్డి, వడ్డేపల్లి గోపి, రామిరెడ్డి చిన్నప్పరెడ్డి, రామిరెడ్డి సుబ్బారెడ్డి, పెసల శ్రీకాంత్‌రెడ్డి, రామిరెడ్డి రాజిరెడ్డి, పెసల చిన్న నారాయణరెడ్డి, పుచ్చకాయల కొండరాజులు, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, ముడమంచు వెంకట రమణ పాల్గొన్నారు .

సర్వసభ్య సమావేశానికి అధికారుల డుమ్మా

కురిచేడు: గతేడాది కురిచేడును కరువు మండలంగా ప్రకటించినా రైతులకు జరిగిన మేలేమి లేదని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి విమర్శించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో శనివారం ఎంపీపీ బి.కోటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది రైతులు కాలం సక్రమంగా కాకపోయినా అరకొరగా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాక తెగ నమ్ముకుని అప్పులపాలయ్యారన్నారు. రైతులతో పంటల బీమా కట్టించినా ఎవరికి బీమా కూడా అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఇంతవరకు సరైన వర్షం లేక ఇంతవరకు పంటలు కూడా సక్రమంగా సాగు చేయలేదని, ఎండలు మండిపోతూ వేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు అందాల్సిన ఎరువులు అందుబాటులో లేకుండా ఈ ఏడాది రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయాధికారులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని రైతులకు ఎరువులు అధిక ధరలకు విక్రయించకుండా సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకుడు గుంతలతో గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ శ్రద్ధగా ఇంకుడు గుంతలు తీసుకునేలా ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా అవగాహన కలిగించాలని కోరారు. స్వామిత్ర సర్వేలో ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ రాజు కోరారు. స్వామిత్ర సర్వేతో గ్రామ కంఠాలకు కూడా రిజిస్ట్రేషన్ అధికారం వస్తుందని తెలిపారు. స్వామిత్ర సర్వే అనంతరం శాశ్వత రిజిస్ట్రేషన్ కార్డు ప్రభుత్వం ఇస్తుందని ఆయన తెలిపారు. మూడు నెలల కొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని అధికారులు డుమ్మా కొట్టారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరై ఆ శాఖ చేపట్టిన అభివృద్ధి పనులు, గత సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారం ఏ మేరకు చేసింది జవాబు చెప్పాల్సి ఉంది. శనివారం ఎంపీపీ కోటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి 8 మంది అధికారులు హాజరు కావటం వారి పనితీరుకు అద్దం పడుతోంది. రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్ శాఖల అధికారులు కింది స్థాయి సిబ్బందిని పంపి మమ అనిపించుకున్నారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, పశువైద్యం, ప్రజారోగ్యం, రోడ్లు భవనాల శాఖ అధికారులు డుమ్మా కొట్టారు. వైస్ ఎంపీపీలు అన్నెం అరుణ, షేక్ కాశింబీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

మంచి సమాజం కోసం పోరాడిన సీతారాం ఏచూరి

దొనకొండ (కురిచేడు): దేశంలో దోపిడీ, పీడన లేని సమానత్వ సమాజం స్థాపన సీతారాం ఏచూరి లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రం దొనకొండలో శనివారం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమం కుందుర్తి చిన్న నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. హాజరైన వారంతా ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ జేఎన్‌యూ విద్యార్థి నేతగా మూడు సార్లు ఎన్నికైన ఆయన విద్య, ఉపాధి ప్రాథమిక హక్కుగా ఉండాలని పోరాడారని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో నాటి ప్రధానమంత్రి ఇందిర గాంధీని ఎదిరించి విద్యార్థి సమస్యలు పరిష్కరించడంలో ఏచూరి పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. మార్క్సిస్టు నాయకుడిగా ఢిల్లీ కేంద్రంగా ప్రారంభమైన ఆయన జీవితం దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు మార్గం చూపే విధంగా సాగిందని తెలిపారు. మత సామరస్యాన్ని కాపాడాలని, లౌకిక శక్తులను ఏకం చేసేందుకు ఏచూరి చేసిన కృషి చాలా గొప్పదన్నారు. యునైటెడ్ ఫ్రంట్ కాలంలో కనీస ఉమ్మడి ప్రణాళికను తయారు చేయడంలో, యూపీఏ ప్రభుత్వ కాలంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సాధించడంలో, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, గిరిజన భూముల రక్షణ చట్టం వంటివి ఏచూరి చొరవతోనే ఏర్పడ్డాయని తెలిపారు. పార్లమెంట్లో ఆయన చేసిన ప్రసంగాలు మన ప్రజాస్వామ్యాన్ని, లౌకిక తత్వాన్ని, సమానత్వాన్ని కాపాడే విధంగా సాగాయన్నారు. మార్క్సిస్టు మేధావిగానేగాక ఆర్థిక శాస్త్రంలో గోల్డ్ మెడలిస్టుగా, సామాజిక, సాంస్కృతిక, క్రీడలు మొదలైన రంగాల్లో ప్రావీణ్యం కలిగిన ఏచూరి వంటి వ్యక్తులు సమాజంలో అరుదుగా ఉంటారని పేర్కొన్నారు. ఏచూరి కోరుకున్న సమానత్వ సమాజ సాధన కోసం ఉద్యమించాల్సిన ఆవశ్యకత నేడు ఎంతో ఉందని పిలుపునిచ్చారు. కేంద్రంలోని ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు భయపడి ఆంక్షలు లేని దిగుమతులకు అవకాశం కల్పించడంతో భారత సార్వభౌమత్వం దెబ్బతింటున్నదన్నారు. మన వ్యవసాయ రంగం, మన దేశ ఉత్పత్తులు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడిందని, అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని పేర్కొన్నారు. లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, సోషలిజం సాధించేందుకు కృషి చేయడమే ఏచూరికి అర్పించే నివాళన్నారు. సీపీఎం మండల నాయకులు చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాలకు అండగా నిలబడేది ఎర్రజెండాయేనని పేర్కొన్నారు. పోరాటాలతో సాధించిన చట్టాలను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని, ఆ చట్టాలు కాపాడుకునేందుకు మళ్లీ పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు ఉధృతం చేద్దామని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కొలా కిరణ్, కొండా ఏసదాసు, కర్ణా కృష్ణ, కె.ఫ్రాన్సిస్, కె.రామయ్య, కొమరగిరి శ్రీను, ఎం.వెంకటయ్య, టి.రాజ, వి.వెంకటేశ్వర్లు, ఎం.యల్లయ్య, వై.ఇశ్రాయేలు, చిరుపల్లి పుష్పాంజలి, కోటేశ్వరమ్మ, వై.ఓర్పు, మరియరాణి పాల్గొన్నారు.



ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఇళ్ల మధ్య నిల్వ ఉన్న మురుగు



నిల్వ ఉన్న మురుగు

తాళ్లూరు: మండంలోని తూర్పుగంగవరం పరిధి సోమవరప్పాడులో పుల్లారావు భోజన హోటల్ వెనక పక్కన వీధిలో ఇళ్ల మధ్య మురుగు నీరు నిల్వ ఉండంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల ప్రభావం అధికంగా ఉందని, విషజర్వాలు సంభవిస్తున్నాయని అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నిల్వ ఉన్న ముగురు నీరు తొలగించాలని స్థానికులు కోరుకుంటున్నారు. ఈ విషయమై పంచాయితీ కార్యదర్శి డి.మల్లేశ్వరిని వివరణ కోరగా ఈ మధ్యకాలంలోనే తూర్పుగంగవరం పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నాని, ఎవరూ మురుగు నిల్వ సమస్య గురించి తన వద్దకు రాలేదన్నారు. ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి వెంటనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మించారు



ఈ మధ్యకాలంలో సీసీ రోడ్డు నిర్మించారు. కానీ రోడ్డుకు ఆనుకుని ఉన్న సైడ్ కాలవలు మట్టితో పూడిపోయాయి. వర్షం నీటితో పాటు ఇళ్లలో నుంచి వచ్చే నీరు పోవడానికి మార్గం లేదు. మురుగు అక్కడే నిల్వ ఉంటు దోమలు అధికంగా విజృంభిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలి.

– చందోలు శ్రీనివాసరావు, సోమవరప్పాడు

నమస్తే పథకంతో జీవన ప్రమాణాలు మెరుగు

దర్శి: నమస్తే పథకంతో జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తున్నట్లు దర్శి మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు తెలిపారు. దర్శి మున్సి పాలిటి పరిధిలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ భాగస్వామ్యంతో చెత్త కాగితాలు, ప్లాస్టిక్ డబ్బాలు సేకరించి జీవనం సాగించే కార్మికుల నమోదు కార్యక్రమం శనివారం దర్శి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ యాక్షన్ ఫర్ మేకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే) పథకంలో భాగంగా వేస్ట్ పిక్కర్ల నమోదు ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ పథకం ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుకునేవారు, జుత్తు సేకరించేవారికి అనధికార పారిశుధ్య కార్మికులకు, వృత్తిపరమైన గుర్తింపు కార్డులు, సామాజిక భద్రత, ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య ప్రయోజనాలు, కల్పించేందుకు తోడ్పడుతుందన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎం.హేమలత మాట్లాడుతూ ఆధార్‌లో లేని వేస్ట్ పిక్కర్లను గుర్తించి వారికి ఆధార్ కార్డులు తీయించనున్నట్లు చెప్పారు. జీరో బ్యాంక్ అకౌంట్‌లో ఈ శ్రమ, ఆయుష్మాన్ భారత్ కార్డులు ప్రతి ఒక్కరికి అదే విధంగా చూడడం ఈ పథకం లక్ష్యమని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే వేస్ట్ పిక్కర్‌ల పిల్లలకు ఈ పథకం ద్వారా ఆ పాఠశాలలో ఫీజులను చెల్లించడం జరుగుతుందన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో–ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ దర్శి మున్సిపాలిటీ పరిధిలోని సాయి నగర్, ఆటోనగర్, పట్టణ పరిధిలోని తదితర ప్రాంతాల్లో వందలాదిగా చెత్త కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, జుత్తు సేకరించే వారు ఉన్నట్లుగా గుర్తించామని, వివరాలు నమోదు చేసి వారిని సామాజిక భద్రతకు కృషి చేస్తామన్నారు. దర్శి ఏరియా కో–ఆర్డినేటర్ గుంటూరు నాగమణి మాట్లాడుతూ 60 మందికి పైగా వేస్ట్ పిక్కర్లు, హెయిర్ పిక్కర్లు హాజరయ్యారని, వారిలో అన్ని ఆధారాలు కలిగి ఉన్న వారిని నమోదు చేయడం జరిగిందని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ సుభానీ, ప్రేమ్‌కుమార్, సంఘ సేవకులు జీవీ రత్నం, పోస్టల్ సిబ్బంది పులిమి బాలకృష్ణ, అపర్ణ, మున్సిపల్ సిబ్బంది, వివిధ సచివాలయ శానిటరీ కార్యదర్శులు, డీబీఆర్‌సీ ప్రతినిధులు, పాల్గొన్నారు.



వేస్ట్ పిక్కర్ల వివరాలు నమోదు

విద్యార్థులతో పెట్టుకున్న ప్రభుత్వాలకు మనుగడ లేదు

పెద్దారవీడు: వైద్య విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాగించిన దాఖలాలు చరిత్రలో లేవన్న వాస్తవాన్ని కూటమి ప్రభుత్వం గుర్తెరగాలని వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ విభాగం జిల్లా అధ్యక్షుడు, సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులను డాక్టర్లుగా తీర్చిదిద్దేందుకు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.8,500 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి శ్రీకారం చూట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రపన్నిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో కీలక నేతలుగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌లు కలిసి మెడికల్ కళాశాలలను నూటికి నూరు శాతం ప్రభుత్వ కళాశాలలుగా కొనసాగిస్తామని తొలుత విద్యార్థులకు ఇచ్చిన హామీ విషయాన్ని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబునాయుడు మాత్రం నారాయణ మెడికల్ కళాశాల వంటి ప్రైవేటు విద్యా సంస్థలకు దోచి పెట్టేందుకు ప్రైవేటీకరణ మంత్రం జపిస్తున్నారని ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో సాకారమైన మెడికల్ కాలేజీలను కక్షపూరితంగా అడ్డుకుని పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేయడం దారుణమన్నారు.



అంగిరేకుల ఆదినారాయణ

5 వేలకు 50 ఎకరాల భూమి

ఈ కుట్రలో అనేక మంది ప్రజాప్రతినిధులు, మంత్రులు సైతం భాగస్వాములే అన్నది బహిరంగ రహస్యమేనని, 50 ఎకరాల భూమిని కేవలం రూ.5 వేలకు 66 ఏళ్ల పాటు ఎవరైనా లీజులకు ఇస్తారా..ని ప్రశ్నించారు. ఇదే చిత్రంగా అనిపిస్తుంటే పులివెందుల, మార్కాపురం, మదనపల్లె, పాడేరు, ఆదోని వైద్య కళాశాలలకు మంజూరైన 750 సీట్లను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నేషనల్ మెడికల్ కమిషనర్‌కు లేఖ రాయడం మరింత విచిత్రమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వమైనా మెడికల్ సీట్లు పెంచమని అడుగుతుంటదనీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అందుకు విరుద్ధంగా సీట్లు వద్దని వాటిని వెనక్కి తీసుకోండి.. అని స్వయంగా కూటమి ప్రభుత్వం కేంద్రానికి లేక రాసిందని వివరించారు.

అమెరికా టారిఫ్ పెంపునకు వ్యతిరేకంగా నిరసన

యర్రగొండపాలెం: అమెరికా టారిఫ్ పెంపునకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పూల సుబ్బయ్య విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేవీ కృష్ణగౌడ్ మాట్లాడుతూ భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరిక అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందని, ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ లాంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచి ఎగుమతులు అవుతున్నాయని, ఏటా సుమారు 2 వేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఎగుమతులు పడిపోవడంతో రొయ్యల ధరలు ఘోరంగా దిగజారిపోయాయన్నారు. ఫలితంగా సముద్ర తీర ప్రాంతల్లోని చేపలు, రొయ్యల పెంపకందారులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారని, గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లో అనకాపల్లి, శ్రీసత్యసాయి, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ఫ్యాక్టరీలు, స్పిన్నింగ్ మిల్లుల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని, ముఖ్యంగా మహిళా కార్మికులు ఎక్కువ మంది తమ భృతి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మన ఎగుమతులపై సుంకం పెంచి అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులను పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని, రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు ఆపాలని షరతులు పెడుతుందని, అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు విధించడంతో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థుల కలలు పేకమేడల్లా కూలిపోతున్నాయని పేర్కొన్నారు. సీపీఐ నాయకులు బాణాల రామయ్య, మన్నె సాంబశివరావు, మొగిలి వెంకటేశ్వర్లు, వై.వెంకటశివయ్య పాల్గొన్నారు.



పూలసుబ్బయ్య విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

హవ్వా.. మాట తప్పిన పోలీసులు!

- దేవుడి కార్యానికీ రాజకీయ రంగులు
- వైఎస్సార్ సీపీ ఊరేగింపునకు ఇవ్వని మైక్ పర్మిషన్
- టీడీపీ వారికి పోలీసులు దగ్గరుండి రికార్డింగ్ డ్యాన్స్‌లు

ముండ్లమూరు (దర్శి): ముండ్లమూరు మండలంలో పోలీసులు చూపిస్తున్న పచ్చపాతానికి సామాన్య ప్రజలు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. వినాయక చవితికి ఏర్పాటు చేసిన కమిటీలతో విగ్రహాల నిమజ్జనాల ఊరేగింపులు సందర్భంగా ఇరుపార్టీల వారిని పిలిచి డీఎస్పీ లక్ష్మీనారాయణ సమావేశం ఏర్పాటు చేశారు. తమకు ఏపార్టీలతో సంబంధం లేదని ఇద్దరూ సమానమేనని చెప్పారు. ఎవరైనా సరే డీజేలు, డ్యాన్స్‌లు వంటి కార్యక్రమాలు నిర్వహణకు అనుమతులు ఇవ్వమని తేల్చి చెప్పారు. బొమ్మలకు మైకులు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఒకటే అని, ఇద్దరూ సమన్వయంతో కార్యక్రమాలు చేసుకోవాలని విలేకరుల సమక్షంలో సూచించి వెళ్లిపోయారు. ఆ తర్వాత పసుపుగల్లులో వైఎసార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం వద్ద డీఎస్పీ మాటలకు కట్టుబడి మైకులు మాత్రమే పెట్టుకుని సాధారణంగా ఊరేగింపు చేసుకుంటుంటే ఎస్సై కమలాకర్ వచ్చి మరో రెండు అడుగులు ముందుకేసి ఆ మైకులు కూడా అనుమతి ఇవ్వమని, మైకులు కూడా తీసివేయించారు. అయితే మరుసటి రోజు టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఊరేగింపుకు మాత్రం డీజేలు, మైకులతో పాటు రికార్డింగ్ డ్యాన్స్‌లు కూడా పోలీసులు దగ్గరుండి మరీ వేయించారు. ఇది డీఎస్పీ ప్రోద్బలంతో వేశారో లేక ఎస్సై అనుమతితో వేశారో తెలియదుగానీ పోలీసుల పచ్చపాతం మాత్రం ఈ విషయంలో స్పష్టంగా అర్థమైంది. పెద్ద పెద్ద డీజే బాక్సులు తెచ్చి మహిళలతో రికార్డింగ్ డ్యాన్స్‌లు పోలీసులే దగ్గరుండి వేయించడంపై స్థానికులు ముక్కున వేలేసుకున్నారు.

ఇదేం ఈ విషయంపై ముండ్లమూరు మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేవుని కార్యక్రమాల్లో కూడా పచ్చపాతం చూపడాన్ని దేవుడే చూసుకుంటాని చెప్పారు. డీఎస్పీ పెద్ద మనిషిలా వచ్చి చెప్పారన్న గౌరవంతో తాము పెట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు రద్దు చేసుకున్నామని పేర్కొన్నారు. తాము సాధారణంగా మైకులు పెట్టుకున్నా ఎస్సై వచ్చి వాటిని దౌర్జన్యంగా తీసివేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు దగ్గరుండి బోద్యం చూడటాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలని పోలీసులను ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి పోలీసులే పాతరేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఎంతవరకు సమంజసమో అర్థం చేసుకోవాలన్నారు. కూటమి నేతల చెప్పు చేతల్లో పోలీసులు పని చేస్తున్నారని చెప్పడానికి ఇంతకంటే ఏం రుజువు కావాలని ప్రశ్నించారు. పోలీసులకు ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న చింతా శ్రీనివాసరెడ్డి



పోలీసుల కళ్లెదుటే రికార్డింగ్ డ్యాన్స్

గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల

పుల్లలచెరువు: మండలంలోని 19 పంచాయతీలకు టైడ్, అన్‌టైడ్ నిధులు మంజూరైట్లు డిప్యూటీ ఎంపీడీవో ఆత్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీలకు రూ.82,60,674 టైడ్ నిధులు, అన్‌టైడ్ రూ.55,07,124 నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఆయా నిధులతో పంచాయతీల్లో మౌలిక వసుతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెద్దారవీడు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ప్రైవేటు అంబులెన్స్ వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని దేవరాజుగట్టు సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పెద్దారవీడు నుంచి ద్విచక్ర వాహనంపై వేశపోగు సాల్మన్‌రాజు దేవరాజుగట్టు గ్రామంలో కరెంటు బిల్లు కట్టేందుకు వెళ్తున్నాడు. మార్కాపురం నుంచి ప్రైవేటు అంబులెన్స్ వాహనం దోర్నాల వైపు వెళ్తోంది. దేవరాజుగట్టు సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సాల్మన్‌రాజును అంబులెన్స్ వాహనం ఢీకొట్టడంతో కుడి చేయి విరిగింది. వెంటనే స్థానికులు మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం డాక్టర్ల సలహాల మెరుకు మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలలో చేర్చారు. అంబులెన్స్ వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో తమ భర్తకు గాయాలయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు భార్య హెప్సీరాణి తెలిపారు.



చికిత్స పొందుతున్న సాల్మన్‌రాజు

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు



సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు

పుల్లలచెరువు: సమాజానికి మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులేనని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జానకి రఘు అన్నారు. శనివారం మండలంలోని పలు పాఠశాలల్లో భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికిపూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఎంఅండ్‌డీకే పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రఘు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైందన్నారు. సమాజానికి దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులేనని వారి సేవలు కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు బాధ్యత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయులు దేశ అభివృద్ధిలో కీలక ప్రాత పోషించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని చెప్పారు. అనంతరం పాఠశాల యాజమన్యం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించింది. డైరెక్టర్ వీరయ్య, గ్రామ పెద్దలు జి.భాస్కరరావు, జీవీ గురునాథం, ఎం.లక్ష్మణ పాల్గొన్నారు.